




PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు








| గురువారం 06 ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల : 2/- | సంపుటి:02 సంచిక :65 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|




## తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు పెంపునకు మహారాష్ట్ర అనుమతులు ఇప్పించాలి: కేంద్ర మంత్రిని కోరిన సీఎం రేవంత్ రెడ్డి

ఢిల్లీ | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 6: ప్రాణహిత నదిపై నిర్మించనున్న తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు పెంపునకు మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ కార్యాలయంలో సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యత, ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తాను రాసిన లేఖ, దానిపై ప్రధానమంత్రి కార్యాలయం స్పందించి జలశక్తి శాఖకు పంపిన విషయాన్ని సీఎం వివరించారు. తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి గతంలోనే రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరిన విషయాన్ని గుర్తు చేశారు. 148 మీటర్ల నుంచి 152 మీటర్ల వరకు బ్యారేజీ ఎత్తు పెంపుపై పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) అధ్యయనం నిర్వహించిందని, అధ్యయనం ప్రకారం 148 మీటర్ల ఎత్తులో నిర్మించినా, 152 మీటర్ల ఎత్తులో నిర్మించినా ముంపు ప్రాంతంలో పెద్దగా తేడా ఉండదని వివరించారు. ముంపులో 50 శాతం వరకు నదీ గర్భంలోనే ఉంటుందని తెలిపారు. 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ద్వారా నీటి సరఫరా సాధ్యం కాదని, అందువల్ల 150 నుంచి 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని కేంద్ర మంత్రిని విజ్ఞప్తి చేశారు. బ్యారేజీ ఎత్తు పెరిగితే గ్రావిటీ ద్వారా నీటి సరఫరా జరిగి విద్యుత్ వినియోగ భారం తగ్గుతుందని, ఈ ప్రాజెక్టు పూర్తయితే వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగునీటి వసతి మెరుగుపడుతుందని తెలిపారు. ఈ అంశంపై త్వరగా తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాల మధ్య సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి లేఖ అందిందని తెలిపిన కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, ముందుగా కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ, మహారాష్ట్ర అధికారులతో సమావేశం నిర్వహించి చర్చల ప్రక్రియ ప్రారంభిస్తామని, అనంతరం రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ మంత్రులతో సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, డాక్టర్ మల్లు రవి, రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, డాక్టర్ కడియం కావ్య, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఈ. శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## 22ఏ భూముల విషయంలో అర్హులెవరికీ అన్యాయం జరగదు: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 6: రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో ఏ పేదవాడికీ, ఏ నిజమైన భూహక్కుదారుడికీ అన్యాయం జరగకుండా చూడటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన వారి హక్కులను కాపాడటంతో పాటు ప్రభుత్వ భూములను పరిరక్షించడం ప్రభుత్వ ద్వంద్వ లక్ష్యమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్దేశపూర్వకంగా ఒక్క సెంటు భూమిని కూడా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చలేదని, వివాదాలు లేని ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 22ఏ అంశంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని అధికారులు పూర్తిగా అర్థం చేసుకుని అదే స్ఫూర్తితో పనిచేయాలని, ప్రతి కేసును రికార్డులు, వాస్తవాలు, చట్టపరమైన అంశాల ఆధారంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. 22ఏకు సంబంధించిన దరఖాస్తులు, ఫిర్యాదులు ఏ స్థాయిలో వచ్చినా పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులో పరిష్కరించాలని, ప్రజావాణిలో వచ్చిన వినతులను కూడా ప్రత్యేక దృష్టితో విచారించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. హైకోర్టు నిర్దేశించిన 45 రోజుల గడువులోనే 22ఏ వివాదాలపై తుది నిర్ణయాలు తీసుకోవాలని, కోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకుని ప్రజలకు న్యాయం జరిగేలా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ భూములపై అక్రమ లావాదేవీలు, అక్రమ రిజిస్ట్రేషన్లు, ఆక్రమణలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, 22ఏ జాబితాలోని భూములపై సమగ్ర పరిశీలన చేసి ప్రజల హక్కులు, ప్రభుత్వ ప్రయోజనాలు రెండింటినీ సమతుల్యం చేస్తూ జిల్లా కలెక్టర్లు పారదర్శకంగా నిర్ణయాలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

## న్యూట్రాస్యూటికల్ పేరుతో గాబాపెంటిన్ మాత్రల విక్రయం – డ్రగ్స్ కంట్రోల్ అధికారుల దాడులు



హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 6: తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు న్యూట్రాస్యూటికల్ (ఆహార ఉత్పత్తి) పేరుతో గాబాపెంటిన్ కలిగిన మందులను తప్పుడు విధంగా తయారు చేసి విక్రయిస్తున్న వ్యవహారాన్ని గుర్తించారు. ఆగస్టు 5న నిర్వహించిన తనిఖీల్లో మలక్‌పేట్ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ అనిల్ ఆధ్వర్యంలో అధికారులు చెర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలోని ఒక తయారీ యూనిట్‌లో తనిఖీలు నిర్వహించగా, "గాబాజెన్ టాబ్లెట్స్" పేరుతో గాబాపెంటిన్ కలిగిన ఔషధాన్ని ఆహార ఉత్పత్తి/న్యూట్రాస్యూటికల్‌గా తప్పుడు లేబుల్‌తో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. గాబాపెంటిన్ వైద్యుల సూచనతో మాత్రమే వినియోగించాల్సిన ప్రిస్క్రిప్షన్ ఔషధమని, దీనిని న్యూట్రాస్యూటికల్‌గా విక్రయించడం చట్టవిరుద్ధమని అధికారులు తెలిపారు. సంబంధిత ఉత్పత్తుల నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపినట్లు, నివేదికల ఆధారంగా బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రజలు అనుమానాస్పదంగా ఔషధాల తయారీ, నిల్వ, విక్రయాలు లేదా ఇతర అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉంటే తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ టోల్‌ఫ్రీ నంబర్ 1800-599-6969కు ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల మధ్య సమాచారం అందించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.



## సాగునీటి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు త్వరగా మంజూరు చేయాలి: కేంద్ర మంత్రిని కోరిన సీఎం రేవంత్ రెడ్డి

ఢిల్లీ | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 6: తెలంగాణలోని పాలమూరు-రంగారెడ్డి, గౌరవెల్లి, సీతమ్మ సాగర్, డిండి ప్రాజెక్టులకు సత్వరమే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌ను కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి పార్లమెంట్‌లో కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన సానుకూల తీర్పు నేపథ్యంలో ఆయా ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులను వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పాలమూరు ప్రాజెక్టుపై రూ.36,437 కోట్లు, డిండి ఎత్తిపోతల పథకంపై రూ.3,187 కోట్లు, సీతమ్మ సాగర్ ప్రాజెక్టుపై రూ.1,835 కోట్లు, గౌరవెల్లి ప్రాజెక్టుపై రూ.1,350 కోట్ల నిధులను ఖర్చు చేసిన విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనుమతులు లేకపోవడంతో పనులు నిలిచిపోయి ప్రాజెక్టుల వ్యయం పెరుగుతోందని వివరించారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఎలాంటి ఆలస్యం లేకుండా పర్యావరణ అనుమతులు మంజూరు చేసి సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేలా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, డాక్టర్ మల్లు రవి, రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, డాక్టర్ కడియం కావ్య, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.






## తెలంగాణ రైజింగ్–2026 గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు వేగవంతం చేయాలి: ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 6: డిసెంబర్‌లో నిర్వహించనున్న "తెలంగాణ రైజింగ్–2026" గ్లోబల్ సమ్మిట్ విజయవంతం అయ్యేలా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రైజింగ్–2047 లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు జాతీయ, అంతర్జాతీయ సంస్థల సహకారం అత్యంత అవసరమని, రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) వృద్ధికి ఈ గ్లోబల్ సమ్మిట్ కీలక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణను అభివృద్ధి, పెట్టుబడులు, పారిశ్రామిక వృద్ధి, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, ఉపాధి కల్పన, సంక్షేమం వంటి అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యంతో ప్రభుత్వం "తెలంగాణ రైజింగ్" కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ భవన సముదాయాలను వినియోగించుకోవాలని, రహదారులు, విద్యుత్, తాగునీటి సరఫరా తదితర మౌలిక సదుపాయాలను సకాలంలో సిద్ధం చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక అభివృద్ధిని మరింత వేగవంతం చేయడం, యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలను విస్తరించడం, ఉపాధి కల్పనను పెంపొందించడం, డిజిటల్ సేవలను మరింత సమర్థవంతంగా అందించడం వంటి అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్-అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, టీజీఐఐసీ ఎండీ శశాంక, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ అజిత్ రెడ్డి, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## విశాఖలో పీవీ సింధు స్పోర్ట్స్ ఎక్సలెన్స్ సెంటర్‌కు భూమిపూజ చేసిన మంత్రి నారా లోకేష్

విశాఖపట్నం | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 6: విశాఖపట్నం అరిలోవ ప్రాంతంలోని తోటగరువులో ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు ఆధ్వర్యంలో నిర్మించనున్న సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ నిర్మాణ పనులకు రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో కలిసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి నారా లోకేష్, అకాడమీ భవన నమూనాను పరిశీలించి క్రీడాకారులకు అందుబాటులోకి రానున్న అత్యాధునిక శిక్షణ సౌకర్యాలు, వసతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్రీడా రంగంలో ప్రతిభ కలిగిన యువతను ప్రోత్సహించేందుకు ఇలాంటి ఆధునిక క్రీడా కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం విశాఖ ఇసుకతోట జంక్షన్‌లోని లాన్సమ్ స్క్వేర్ భవనంలో ఐబీఎం సంస్థ ఏర్పాటు చేసిన కన్సల్టింగ్ ఫ్యూచర్‌నౌ సెంటర్‌ను ఐబీఎం ఇండియా, సౌత్ ఏసియా మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ పటేల్‌తో కలిసి మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధస్సు (ఏఐ), డిజిటల్ పరివర్తన సేవలకు మద్దతుగా ఈ కేంద్రం పనిచేయనుందని, భారతదేశ సాంకేతిక ఆవిష్కరణలు, ప్రతిభావంతులైన మానవ వనరుల అభివృద్ధిలో ఐబీఎం పెట్టుబడులకు ఇది మరో కీలక ముందడుగు కానుందని పేర్కొన్నారు.

# కోదాడ ఖేలో ఇండియా కబడ్డీ కేంద్రంలో ఉచిత శిక్షణకు ఆహ్వానం

సూర్యాపేట | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 6: సూర్యాపేట జిల్లా కోదాడలోని కేఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఖేలో ఇండియా కబడ్డీ శిక్షణ కేంద్రంలో ఇప్పటివరకు శిక్షణ పొందిన క్రీడాకారులతో పాటు కొత్తగా కబడ్డీ శిక్షణ పొందాలనుకునే వారికి ఉచితంగా శిక్షణ అందిస్తున్నట్లు జిల్లా యువజన మరియు క్రీడల అధికారి బి. వెంకట్ రెడ్డి తెలిపారు. జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్న సీనియర్ కబడ్డీ క్రీడాకారుడిని కోచ్‌గా నియమించినట్లు పేర్కొన్నారు. ఆగస్టు 1, 2026 నుంచి ప్రతిరోజూ ఉదయం 6:00 గంటల నుంచి 8:30 గంటల వరకు, సాయంత్రం 4:30 గంటల నుంచి 7:00 గంటల వరకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కబడ్డీపై ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ, మరిన్ని వివరాలకు కబడ్డీ కోచ్‌ను 9515927426 నంబర్‌లో సంప్రదించాలని జిల్లా యువజన మరియు క్రీడల అధికారి సూచించారు.



# మేళ్లచెరువు రైస్ మిల్లులో రూ.53.66 కోట్ల ప్రభుత్వ ధాన్యం, బకాయిల వ్యత్యాసాలు గుర్తింపు

సూర్యాపేట | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 6: సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలంలోని శ్రీ శ్రీనివాస సాయి శివాయ రైస్ ఇండస్ట్రీస్‌లో రీజినల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం, నల్గొండ అధికారులు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులతో కలిసి నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో భారీ స్థాయిలో ప్రభుత్వ ధాన్యం నిల్వల వ్యత్యాసాలు వెలుగుచూశాయి. రబీ 2022-23, రబీ 2023-24, ఖరీఫ్ 2024-25, రబీ 2024-25 సీజన్లకు సంబంధించిన ఆన్‌లైన్ రికార్డులు, స్టాక్ వివరాలు, మిల్లులో భౌతికంగా ఉన్న నిల్వలను పరిశీలించగా గణనీయమైన తేడాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రాథమిక విచారణలో ఆక్షన్ ధాన్యాన్ని మినహాయించి సుమారు 19,843.429 మెట్రిక్ టన్నుల ప్రభుత్వ ధాన్యం అందుబాటులో లేకపోవడం గుర్తించినట్లు తెలిపారు. అలాగే రబీ 2022-23 సీజన్‌కు సంబంధించి ప్రభుత్వానికి చెల్లించాల్సిన సుమారు రూ.5.66 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడించారు. అదేవిధంగా వివిధ సీజన్లకు చెందిన సుమారు 19,843.429 మెట్రిక్ టన్నుల ప్రభుత్వ ధాన్యం మాయమైనట్లు ప్రాథమికంగా నిర్ధారించగా, ఆ ధాన్యం విలువ సుమారు రూ.48 కోట్లుగా అంచనా వేశారు. దీంతో ప్రభుత్వ ధాన్యం విలువ, బకాయిలు కలిపి సుమారు రూ.53.66 కోట్ల మేర ప్రభుత్వానికి నష్టం సంభవించినట్లు అధికారుల బృందం ప్రాథమికంగా నిర్ధారించింది. పూర్తి స్థాయి విచారణ అనంతరం తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పించి నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో రీజినల్ విజిలెన్స్ అధికారి ప్రతాప్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గౌస్, జిల్లా పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ ధాన్యాన్ని అక్రమంగా మాయం చేయడం, దుర్వినియోగం చేయడం లేదా ప్రభుత్వ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై సంబంధిత చట్టాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, అమలులో ఉన్న నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌర సరఫరాల అధికారి హెచ్చరించారు.




# యువత, మహిళల ఆవిష్కరణలకు వీ హబ్ వేదిక: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 6: జిల్లాలోని యువత, మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వారి వ్యాపార ఆలోచనలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు కల్పించేందుకు వీ హబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల విద్యార్థులు, టైర్-2, టైర్-3 నగరాల్లోని మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో గ్రాస్‌రూట్స్ యూత్ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్ మరియు సోషల్ ఇంపాక్ట్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ కార్యక్రమాలను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ 17 నుంచి 23 ఏళ్ల మధ్య వయస్సు గల అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు ఈ కార్యక్రమాలకు దరఖాస్తు చేసుకోవచ్చని, జిల్లాలో హ్యాకథాన్లు, ఐడియాషన్ సెషన్లు నిర్వహించి 12 వారాల పాటు ఇంటర్న్‌షిప్, పేటెంటింగ్ సహాయం, సాఫ్ట్ స్కిల్స్ శిక్షణతో పాటు ఆలోచన దశ నుంచి ప్రోటోటైప్ తయారీ వరకు పూర్తి మార్గదర్శకత్వం అందిస్తామని తెలిపారు. మహిళలు, వెనుకబడిన వర్గాలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేకంగా సోషల్ ఇంపాక్ట్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ కార్యక్రమాన్ని రూపొందించామని, ఎఫ్ఎంసీజీ, ఫుడ్ ప్రాసెసింగ్, చేనేత తదితర రంగాల్లో వ్యాపారం చేస్తున్న వారికి ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. మూడు నెలల పాటు డిజిటల్ నెట్‌వర్కింగ్, వ్యాపార నిర్వహణపై శిక్షణ, ఆరు నెలల పాటు ఫండింగ్, న్యాయపరమైన సహాయం, డిజిటల్ మార్కెటింగ్‌లో మద్దతు అందించనున్నట్లు వెల్లడించారు. మహిళా ప్రామాణికతా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, ఆసక్తి గల వారు వీ హబ్ వెబ్‌సైట్ ద్వారా పూర్తి వివరాలు తెలుసుకుని ఈ అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం వీ హబ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ పీడీ సన్యాసయ్య, డీఈఓ అశోక్, మెప్మా పీడీ శ్రీనివాస్, డీడబ్ల్యూఓ నరసింహారావు, వీ హబ్ సీఈఓ సీతా పళ్లచుని, అసోసియేట్ డైరెక్టర్ జహీర్ అక్తర్ షేక్, ఊహ సజ్జ తదితరులు పాల్గొన్నారు.

## యువత, మహిళల ఆవిష్కరణలకు వీ హబ్ వేదిక: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 6: జిల్లాలోని యువత, మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వారి వ్యాపార ఆలోచనలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు కల్పించేందుకు వీ హబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల విద్యార్థులు, టైర్-2, టైర్-3 నగరాల్లోని మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో గ్రాస్‌రూట్స్ యూత్ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్ మరియు సోషల్ ఇంపాక్ట్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ కార్యక్రమాలను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ 17 నుంచి 23 ఏళ్ల మధ్య వయస్సు గల అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు ఈ కార్యక్రమాలకు దరఖాస్తు చేసుకోవచ్చని, జిల్లాలో హ్యాకథాన్లు, ఐడియాషన్ సెషన్లు నిర్వహించి 12 వారాల పాటు ఇంటర్న్‌షిప్, పేటెంటింగ్ సహాయం, సాఫ్ట్ స్కిల్స్ శిక్షణతో పాటు ఆలోచన దశ నుంచి ప్రోటోటైప్ తయారీ వరకు పూర్తి మార్గదర్శకత్వం అందిస్తామని తెలిపారు. మహిళలు, వెనుకబడిన వర్గాలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేకంగా సోషల్ ఇంపాక్ట్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ కార్యక్రమాన్ని రూపొందించామని, ఎఫ్ఎంసీజీ, ఫుడ్ ప్రాసెసింగ్, చేనేత తదితర రంగాల్లో వ్యాపారం చేస్తున్న వారికి ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. మూడు నెలల పాటు డిజిటల్ నెట్‌వర్కింగ్, వ్యాపార నిర్వహణపై శిక్షణ, ఆరు నెలల పాటు ఫండింగ్, న్యాయపరమైన సహాయం, డిజిటల్ మార్కెటింగ్‌లో మద్దతు అందించనున్నట్లు వెల్లడించారు. మహిళా ప్రామాణికతా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, ఆసక్తి గల వారు వీ హబ్ వెబ్‌సైట్ ద్వారా పూర్తి వివరాలు తెలుసుకుని ఈ అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం వీ హబ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ పీడీ సన్యాసయ్య, డీఈఓ అశోక్, మెప్మా పీడీ శ్రీనివాస్, డీడబ్ల్యూఓ నరసింహారావు, వీ హబ్ సీఈఓ సీతా పళ్లచుని, అసోసియేట్ డైరెక్టర్ జహీర్ అక్తర్ షేక్, ఊహ సజ్జ తదితరులు పాల్గొన్నారు.



# పిల్లలు పెద్ద కలలు కని వాటిని సాధించేలా కష్టపడాలి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 6: ప్రతి విద్యార్థి జీవితంలో గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించేందుకు ఇప్పటి నుంచే పునాది వేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. సూర్యాపేటలోని జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయులతో ముచ్చటిస్తూ తరగతి గది విద్యతో పాటు డిజిటల్ బోధన, క్రీడలు, క్రమశిక్షణ విద్యార్థుల సర్వాంగీణ వికాసానికి ఎంతో అవసరమన్నారు. పాఠశాలలో నాణ్యమైన విద్య కోసం అవసరమైన అన్ని వసతులు కల్పిస్తామని హామీ ఇస్తూ ప్రిన్సిపల్ విజ్ఞప్తి మేరకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే 10 కంప్యూటర్లతో కూడిన కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీని సీఎస్ఆర్ నిధులు లేదా జిల్లా నిధుల ద్వారా త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. విద్యార్థులు పోటీ తత్వాన్ని పెంపొందించుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, పదో తరగతి తర్వాత ఏ విద్యా శాఖను ఎంచుకున్నా అందులో రాణించే సామర్థ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. టేబుల్ టెన్నిస్‌తో పాటు ఇతర క్రీడా సామగ్రి అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. తన చిన్ననాటి సైనిక్ స్కూల్ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్న కలెక్టర్, నవోదయ విద్యార్థులు భవిష్యత్తులో డాక్టర్లు, ఇంజనీర్లు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు మాత్రమే కాకుండా దేశాన్ని నడిపించే నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కోదాడలో నవోదయ విద్యాలయానికి శాశ్వత భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, అకాడమిక్ బ్లాక్, హాస్టళ్లు, క్రీడా మైదానాలు, డైనింగ్ హాల్‌తో కూడిన ఆధునిక క్యాంపస్‌ను ఏడాదిన్నరలో అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. ప్రస్తుతం కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్, రోబోటిక్స్ వంటి సాంకేతిక రంగాలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని, చదువుతో పాటు పాఠ్యేతర కార్యక్రమాల్లోనూ ప్రతిభ కనబరచాలని సూచించారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వారికి అందిస్తున్న ఆహార నాణ్యత, మెనూ వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో నవోదయ ప్రిన్సిపల్ ఆదినారాయణ, ఉపాధ్యాయులు రాధాకృష్ణ, గంగాభవాని, జ్ఞానేశ్వరి, రాంబాబు, వైష్ణవి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.



# పక్కా ఓటర్ల జాబితా రూపొందించడమే లక్ష్యం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 6: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేసి ఎలాంటి తప్పుల్లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సూర్యాపేట మండల కేంద్రంలో ఆర్డీవో, తహసీల్దార్, బీఎల్ఓ సూపర్‌వైజర్లు, బీఎల్ఓలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణ, డేటా నమోదు ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించి ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫారాన్ని క్షేత్రస్థాయిలో తిరిగి ధృవీకరించాలని సూచించారు. ముఖ్యంగా సేకరించని ఫారాలు, గైర్హాజరైన వారు, ఇతర ప్రాంతాలకు మారిన వారు, మరణించిన వారి వివరాలను పూర్తిస్థాయిలో నిర్ధారించాలని ఆదేశించారు. ఎక్కడైనా డూప్లికేట్ ఓట్లు లేదా ఒకే వ్యక్తికి సంబంధించిన ఒకటి కంటే ఎక్కువ నమోదులు ఉంటే వెంటనే గుర్తించి సరిచేయాలని సూచించారు. సవరణ ప్రక్రియకు గడువు పొడిగించబడిన నేపథ్యంలో లభించిన సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఒక్క అర్హుడి ఓటు కూడా మిస్ కాకుండా చూడాలని, ఖచ్చితమైన ఓటర్ల జాబితా తయారీలో బీఎల్ఓలు, సూపర్‌వైజర్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. కలెక్టరేట్ అధికారులు మండలాల వారీగా నమోదైన వివరాలను క్రాస్ చెక్ చేస్తున్నారని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారంలో ఒక్కచోట మాత్రమే దరఖాస్తు చేస్తున్నట్లు ఇచ్చే డిక్లరేషన్‌ను ఉల్లంఘిస్తూ కావాలనే డూప్లికేట్ దరఖాస్తులు సమర్పించినా లేదా తప్పుడు సమాచారం ఇచ్చినా సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఆర్డీవో వేణుమాధవ్ రావు, తహసీల్దార్ సాయి గౌడ్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సెంట్రల్ లైబ్రరీని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 6: సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పట్టణంలోని సెంట్రల్ లైబ్రరీని ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ చదువుకుంటున్న విద్యార్థులు, నిరుద్యోగ అభ్యర్థులతో ఆప్యాయంగా ముచ్చటించారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా లైబ్రరీకి చేరుకున్న ఆయన ప్రతి గదిని పరిశీలించి అభ్యర్థులు చదువుతున్న పుస్తకాలు, వారు సిద్ధమవుతున్న పోటీ పరీక్షలు, నోట్స్ తయారీ విధానంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. అనంతరం లైబ్రరీలో తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, కుర్చీలు, బెంచీలు, పరిశుభ్రత, పుస్తకాల లభ్యత, రోజువారీ పత్రికలు, మ్యాగజైన్ల అందుబాటుపై ప్రత్యేకంగా ఆరా తీశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని, లైబ్రరీని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. లైబ్రరీలో ఎదురవుతున్న సమస్యలు ఏవైనా ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని అభ్యర్థులకు సూచిస్తూ, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.



## ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేయాలి: అదనపు కలెక్టర్ హరిసింగ్

సూర్యాపేట | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 6: ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేసేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని అదనపు కలెక్టర్ హరిసింగ్ కోరారు. తుంగతుర్తి మండల పరిషత్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఎలాంటి అవకతవకలు లేకుండా, అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువును సద్వినియోగం చేసుకుని ప్రత్యేక సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని, ఓటర్లకు సరైన అవగాహన కల్పించడంలో రాజకీయ పార్టీ నాయకులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో బూత్ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. ఈ సమావేశంలో తుంగతుర్తి తహసీల్దార్ దయానందం, బీజేపీ నుంచి యాదగిరి, బీఆర్ఎస్ నుంచి తాటికొండ సీతయ్య, రాములు, సీపీఎం నుంచి బుర్ర శ్రీనివాస్, పల్లా సుదర్శన్, తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



## ‘దోస్త్’ స్పెషల్ డ్రైవ్ డిగ్రీ ప్రవేశాలు ప్రారంభం

స్టేషన్ ఘనపూర్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 6: 2026–27 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ‘దోస్త్’ స్పెషల్ డ్రైవ్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. స్టేషన్ ఘనపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ ప్రత్యేక విడత ద్వారా విద్యార్థులకు ప్రవేశ అవకాశాలు కల్పిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బి. చంద్రమౌళి తెలిపారు. స్పెషల్ డ్రైవ్ రిజిస్ట్రేషన్లు ఆగస్టు 6 నుంచి 11 వరకు, వెబ్ ఆప్షన్ల నమోదు ఆగస్టు 6 నుంచి 12 వరకు కొనసాగుతాయని, సీట్ల కేటాయింపు ఆగస్టు 14న జరుగుతుందని తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు ఆగస్టు 14 నుంచి 18 వరకు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేసి అనంతరం కళాశాలలో నేరుగా రిపోర్ట్ చేయాలని సూచించారు. స్టేషన్ ఘనపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ లైఫ్ సైన్స్, బీఎస్సీ ఫిజికల్ సైన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, అన్ని కోర్సుల్లో కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టు కూడా ఉందని తెలిపారు. ఇప్పటివరకు దోస్త్ ద్వారా ప్రవేశం పొందలేని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## ఆర్టికల్ 370 రద్దుతో జమ్మూకశ్మీర్, లడఖ్‌లో అభివృద్ధికి కొత్త అధ్యాయం: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 6: ఆర్టికల్ 370, 35(ఏ) రద్దై ఏడేళ్లు పూర్తైన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందిస్తూ, 2019 ఆగస్టు 5న తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయంతో జమ్మూకశ్మీర్, లడఖ్ అభివృద్ధి పథంలో కొత్త అధ్యాయం ప్రారంభమైందని పేర్కొన్నారు. గత ఏడేళ్లలో మౌలిక వసతులు, విద్య, వైద్యం, పారిశ్రామిక అవకాశాలు, క్రీడలు వంటి అనేక రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించామని తెలిపారు. మహిళలు, వెనుకబడిన వర్గాలు సహా దశాబ్దాలుగా రాజ్యాంగ హక్కులకు దూరంగా ఉన్న ప్రజలకు భారత రాజ్యాంగం పూర్తిస్థాయిలో అమలుకావడంతో సాధికారత లభించిందని అన్నారు. ఈ ఏడాది ఆగస్టు 5కు మరో ప్రత్యేకత ఉందని, దేశం డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతిని జరుపుకుంటోందని గుర్తుచేశారు. జాతీయ ఐక్యత కోసం ఆయన కలలు కన్న లక్ష్యం 2019 ఆగస్టు 5న సాకారమైందని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్, లడఖ్ సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి పౌరుడు పెద్ద కలలు కని వాటిని సాకారం చేసుకునే అవకాశాలు కల్పిస్తూ వికసిత్ భారత్ నిర్మాణ దిశగా ముందుకు సాగుతామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

## రైట్ టు సర్వీస్ బిల్లు-2026తో ఢిల్లీలో పారదర్శక పాలనకు మరో ముందడుగు




న్యూఢిల్లీ | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 6: ఢిల్లీ ప్రభుత్వం రైట్ టు సర్వీస్ బిల్లు-2026 ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలను నిర్ణీత గడువులో, పారదర్శకంగా, బాధ్యతాయుతంగా అందించే దిశగా కీలక అడుగు వేసిందని వెల్లడించింది. ఈ కొత్త విధానం ద్వారా ప్రతి దరఖాస్తుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య (యూనిక్ అప్లికేషన్ నంబర్) అందించడంతో పాటు దరఖాస్తుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేలా రియల్ టైమ్ ట్రాకింగ్ సౌకర్యం కల్పించనున్నారు. నిర్ణీత సమయంలో సేవలు అందకపోతే దరఖాస్తు స్వయంచాలకంగా తదుపరి స్థాయి అధికారుల పరిశీలనకు వెళ్లే విధానం అమలు చేయనున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై బాధ్యతను నిర్ణయించేలా నిబంధనలు రూపొందించినట్లు ప్రభుత్వం తెలిపింది. మరోవైపు భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో ఢిల్లీలో ఆరోగ్య వ్యవస్థ మరింత బలోపేతం అవుతోందని పేర్కొంది. 415కి పైగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల ద్వారా ప్రజలకు వారి ఇళ్లకు సమీపంలో మెరుగైన వైద్య సేవలు, ఉచిత వైద్య పరీక్షలు, అవసరమైన ఆరోగ్య సదుపాయాలు అందుతున్నాయని తెలిపింది. భవిష్యత్తులో 1100కుపైగా కేంద్రాలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించింది.



## హరీష్‌రావు తప్పుడు ప్రచారం మానుకోవాలి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 6: బీఆర్ఎస్ నేత హరీష్‌రావు తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. కట్టు కథలు సృష్టించి నిందలు మోపడం సరికాదని, తెలంగాణ ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోదని స్పష్టం చేశారు. కృష్ణా, గోదావరి జలాల అంశాల్లో రాష్ట్ర రైతుల నీటి హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముందుగా కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అవకతవకలు, ముడుపుల ఆరోపణలపై సమాధానం చెప్పాలని హరీష్‌రావును డిమాండ్ చేశారు. గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) అజెండాలో కొత్తగా ఎలాంటి అంశాలు లేవని, గత 12 ఏళ్లుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇదే తరహా అభ్యంతరాలు వ్యక్తం చేస్తోందని తెలిపారు. పోలవరం, పట్టిసీమ, రాయలసీమ ఎత్తిపోతల వంటి పనులు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని మంత్రి పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని, తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణలో ప్రభుత్వం స్పష్టమైన వైఖరితో ముందుకు సాగుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.



## విద్యార్థులు దేశ భవిష్యత్‌ను నిర్ణయిస్తారు రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 6: విద్యార్థులతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమావేశమై విద్యా వ్యవస్థలో సంస్కరణల అవసరం ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు ఎలాంటి దాడులకు పాల్పడలేదని, అయినప్పటికీ వారిని పోలీసులు బెదిరిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులు ఎవరికీ క్షమాపణలు చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు. దేశ భవిష్యత్‌ను విద్యార్థులే నిర్ణయిస్తారని, యువత భవిష్యత్తును కాపాడే విధంగా విద్యా విధానం ఉండాలని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. విద్యా రంగంలో నెలకొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు సమగ్ర మార్పులు అవసరమని, ముఖ్యంగా ప్రశ్నాపత్రాల లీకేజీలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపారు.

## బహిరంగ క్షమాపణలు చెప్పిన మార్క్ జుకర్‌బర్గ్

అంతర్జాతీయం | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 6: మెటా సంస్థ అధినేత మార్క్ జుకర్‌బర్గ్ తన సంస్థ నిర్వహణలో జరిగిన తప్పిదాలపై బహిరంగంగా క్షమాపణలు తెలిపారు. చైల్డ్ సెక్సువల్ అబ్యూస్ మెటీరియల్ (CSAM), డీప్‌ఫేక్ కంటెంట్ వంటి హానికరమైన కంటెంట్ వ్యాప్తిని అరికట్టడంలో లోపాలు జరిగాయని ఆయన విచారం వ్యక్తం చేశారు. కొన్ని రకాల కంటెంట్‌ను ప్రోత్సహించేందుకు, విస్తృతంగా వ్యాప్తి చేయడానికి భారీ మొత్తంలో ఆదాయం పొందినట్లు మెటా అంగీకరించినట్లు సమాచారం. ప్లాట్‌ఫామ్ నిర్వహణలో జరిగిన తీవ్ర పొరపాట్లను గుర్తిస్తూ వినియోగదారుల నమ్మకాన్ని తిరిగి పొందేందుకు చర్యలు తీసుకుంటామని జుకర్‌బర్గ్ తెలిపారు. హానికరమైన కంటెంట్ నియంత్రణ, భద్రతా ప్రమాణాల మెరుగుదలపై మరింత దృష్టి సారిస్తామని మెటా వెల్లడించింది.




## అంతర్జాతీయ ట్రాఫిక్ లైట్స్ దినోత్సవం.. రహదారి భద్రతపై అవగాహనకు ప్రతీక

సూర్యాపేట | సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి | ఆగస్టు 6: ప్రతి సంవత్సరం ఆగస్టు 5న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ ట్రాఫిక్ లైట్స్ దినోత్సవాన్ని నిర్వహిస్తూ రహదారి భద్రత, ట్రాఫిక్ నియంత్రణ ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. 1914 ఆగస్టు 5న అమెరికాలోని ఒహియో రాష్ట్రం క్లీవ్‌ల్యాండ్ నగరంలో జేమ్స్ హోగ్ రూపొందించిన తొలి విద్యుత్ ట్రాఫిక్ సిగ్నల్‌ను ఏర్పాటు చేయడంతో ఈ దినోత్సవానికి ఆరంభమైంది. ప్రారంభంలో ఎరుపు, ఆకుపచ్చ రంగులతో మాత్రమే పనిచేసిన ట్రాఫిక్ సిగ్నల్‌కు అనంతరం డెట్రాయిట్ పోలీసు అధికారి విలియం పాట్స్ పసుపు రంగును జోడించి ఆధునిక మూడు రంగుల విధానాన్ని తీసుకొచ్చారు. అనంతరం 1920 డిసెంబర్ 20న డెట్రాయిట్‌లో నాలుగు దిశల ట్రాఫిక్‌ను నియంత్రించే ఆటోమేటెడ్ సిగ్నల్ వ్యవస్థను తొలిసారిగా ఏర్పాటు చేయగా, అదే నేటి ఆధునిక ట్రాఫిక్ లైట్లకు పునాది అయింది. రహదారి ప్రమాదాలను తగ్గించడం, వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడం, పాదచారులకు సురక్షిత ప్రయాణాన్ని కల్పించడం వంటి అంశాల్లో ట్రాఫిక్ లైట్ల పాత్ర అత్యంత కీలకమని ఈ దినోత్సవం మరోసారి గుర్తు చేస్తోంది.

## ప్రముఖ నటుడు ప్రదీప్ రావత్ కన్నుమూత



ముంబై | సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి | ఆగస్టు 6: హిందీ, తెలుగు చిత్రసీమలో విలక్షణ నటుడిగా గుర్తింపు పొందిన ప్రముఖ నటుడు ప్రదీప్ రావత్ (74) గుండెపోటుతో కన్నుమూశారు. రక్తం గడ్డకట్టడం (బ్లడ్ క్లాట్) కారణంగా తీవ్ర అస్వస్థతకు గురైన ఆయన ముంబైలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కించిన సై సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమైన ప్రదీప్ రావత్, ఛత్రపతి చిత్రంలో విలన్ పాత్రతో విశేష గుర్తింపు పొందారు. తెలుగు, తమిళం, కన్నడ తదితర దక్షిణాది భాషల్లో 70కిపైగా చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించారు. బాలీవుడ్‌లో లగాన్ సినిమాతో విశేష గుర్తింపు తెచ్చుకున్న ఆయన, చివరిసారిగా తెలుగు ప్రేక్షకులకు గాయపడ్డ సింహం చిత్రంలో కనిపించారు. తన ఏకైక కుమారుడిని హీరోగా చూడాలన్న కోరిక నెరవేరకుండానే ఆయన మరణించడం కుటుంబ సభ్యులు, అభిమానులను తీవ్ర విషాదంలో ముంచెత్తింది. సినీ ప్రముఖులు, అభిమానులు ఆయన మృతికి సంతాపం తెలుపుతూ నివాళులర్పిస్తున్నారు.



## అనాథ బాలికపై వేధింపులు.. బంధువులపై కేసు నమోదు

తూప్రాన్ | సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి | ఆగస్టు 6: తల్లిదండ్రులు మరణించడంతో బంధువుల వద్ద ఉంటున్న 12 ఏళ్ల బాలికను ఇంటి పనులు బలవంతంగా చేయించడంతో పాటు శారీరక, మానసిక వేధింపులకు గురిచేసిన ఘటన తూప్రాన్ పట్టణంలో వెలుగుచూసింది. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) అధికారి శంకర్ గౌడ్ ఫిర్యాదు మేరకు తూప్రాన్ పోలీసులు సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం తూప్రాన్ పట్టణంలోని ఓ కాలనీలో నివసిస్తున్న బాలికకు తల్లిదండ్రులు మరణించడంతో బంధువులు తమ వద్ద ఉంచుకున్నారు. అయితే ఆమెతో బలవంతంగా ఇంటి పనులు చేయించడం, కొట్టడం, మానసికంగా వేధించడం వంటి ఆరోపణలు రావడంతో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ జోక్యం చేసుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలిక గోప్యతను దృష్టిలో ఉంచుకుని ఆమె పేరు, చిరునామా లేదా గుర్తింపునకు దారితీసే ఇతర వివరాలను పోలీసులు వెల్లడించలేదు. చిన్నారులపై మానసిక వేధింపులు, బాల కార్మికత్వం లేదా ఏ రూపంలోనైనా దుర్వినియోగం జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా డయల్-100/112కు సమాచారం ఇవ్వాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పిల్లల హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్నారుల గుర్తింపును వెల్లడించే వివరాలను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు.




## సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి మెదక్ ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

మెదక్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 6: సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా కొత్త రూపాల్లో పెరుగుతున్నాయని, ప్రజలు డిజిటల్ ప్రపంచంలో అప్రమత్తంగా వ్యవహరించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ సూచించారు. జాతీయ సైబర్ జాగృత్ దివస్ సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సురక్షా కా తిరంగా–సైబర్ స్వతంత్ర తెలంగాణ' కార్యక్రమంలో భాగంగా మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సైబర్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో ప్రతిరోజూ సైబర్ నేరాల వల్ల ప్రజలు కోట్ల రూపాయలు కోల్పోతున్నారని పేర్కొంటూ, సోషల్ మీడియాలో కనిపించే నకిలీ స్టాక్ మార్కెట్ పెట్టుబడి ప్రకటనలు, వాట్సాప్ గ్రూపుల ద్వారా వచ్చే తప్పుడు లాభాల ప్రచారాలను నమ్మవద్దని హెచ్చరించారు. ఉద్యోగాల పేరుతో ఫీజులు, ప్రాసెసింగ్ ఛార్జీలు అడిగే మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, నిజమైన ఉద్యోగ సంస్థలు అభ్యర్థుల నుంచి డబ్బులు వసూలు చేయవని స్పష్టం చేశారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, ఏటీఎం లేదా డెబిట్ కార్డు వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్లు, ఫిషింగ్ లింకులు, తప్పుడు ప్రచారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. విద్యార్థులు సైబర్ భద్రతపై అవగాహన పెంచుకొని తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి పౌరుడు బాధ్యతాయుతమైన డిజిటల్ పౌరుడిగా వ్యవహరించినప్పుడే 'సైబర్ స్వతంత్ర తెలంగాణ' లక్ష్యం సాధ్యమవుతుందని పేర్కొంటూ విద్యార్థులతో సైబర్ అవగాహనా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డీఎస్పీలు సుభాష్ చంద్రబోస్, ప్రసన్నకుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కే. హుస్సేన్, అధ్యాపకులు, సైబర్ క్రైమ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




## తల్లిపాలతోనే శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం – తొలి ఆరు నెలలు తల్లిపాలే శ్రేష్ఠమైన ఆహారం

సంగారెడ్డి | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 6: ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సంగారెడ్డి జిల్లా ఫసల్‌వాది గ్రామంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. లలితాదేవి, జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి లలిత కుమారి హాజరై చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ, శిశువు జన్మించిన తొలి గంటలోనే తల్లిపాలను ప్రారంభించడం ద్వారా రోగనిరోధక శక్తి పెరిగి అనేక అంటువ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని తెలిపారు. తొలి ఆరు నెలల పాటు శిశువుకు తల్లిపాలు మాత్రమే అందించాలని, అదనపు ఆహారం లేదా నీరు ఇవ్వాల్సిన అవసరం లేదని సూచించారు. తల్లిపాలు శిశువు శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతో కీలకమని, తల్లి ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తాయని వివరించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత, పోషకాహారం, శిశు సంరక్షణపై అవగాహన కల్పించి, ప్రతి తల్లి తన బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని పిలుపునిచ్చారు.

## ఎన్ఎస్పీ క్యాంపు సెక్టార్‌లో ఘనంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు



మిర్యాలగూడ | సందేశం టైమ్స్ నల్గొండ జిల్లా ఇంచార్జి | ఆగస్టు 6: ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ పి. వేణుగోపాలరావు ఆదేశాల మేరకు ఎన్ఎస్పీ క్యాంపు సెక్టార్ పరిధిలోని శాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ వాణి పాల్గొని తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. శిశువు జన్మించిన గంటలోపు వచ్చే ముర్రిపాలలో ఉండే కొలస్ట్రం శిశువుకు మొదటి టీకాలా పనిచేస్తుందని, అందువల్ల తప్పనిసరిగా ఆ పాలను బిడ్డకు ఇవ్వాలని సూచించారు. అలాగే పుట్టిన రోజు నుంచి తొలి ఆరు నెలల వరకు ఎలాంటి ఇతర ఆహారం లేదా ద్రవాలు ఇవ్వకుండా కేవలం తల్లిపాలు మాత్రమే అందించాలని వివరించారు. తల్లిపాలు శిశువు ఎదుగుదల, రోగనిరోధక శక్తి పెంపు, సంపూర్ణ ఆరోగ్యానికి ఎంతో కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ నాగలక్ష్మి, అంగన్‌వాడీ హెల్పర్, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.




## బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

మెదక్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 6: 15 ఏళ్ల బాలికను మాయమాటలతో నమ్మించి అపహరించి లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడు అక్తర్ (22)కు జిల్లా ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలిపారు. అలాగే బాధితురాలికి రూ.లక్ష పరిహారం మంజూరు చేయాలని కోర్టు ఆదేశించిందన్నారు. పాన్‌షాప్ నిర్వహిస్తున్న అక్తర్ 15 ఏళ్ల బాలికను మాయమాటలతో నమ్మించి అపహరించి ఆమెపై లైంగిక దాడికి పాల్పడగా, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు 2024 ఏప్రిల్‌లో అప్పటి నార్సింగి ఎస్ఐ అహ్మద్ మొహినొద్దీన్ కేసు నమోదు చేశారు. అనంతరం అప్పటి రామాయంపేట సీఐ వెంకటరాజా గౌడ్ దర్యాప్తు చేపట్టి సాక్ష్యాధారాలను సేకరించి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య సమర్థవంతంగా వాదనలు వినిపించగా, ప్రాసిక్యూషన్ సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావాలి నిందితుడిని దోషిగా నిర్ధారించి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించారు. బాలికలపై లైంగిక నేరాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రతి కేసులో పటిష్టమైన దర్యాప్తు చేసి నిందితులకు శిక్ష పడేలా బలమైన సాక్ష్యాధారాలు సమర్పించాలని పోలీసు అధికారులకు ఎస్పీ సూచించారు. నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించిన అప్పటి నార్సింగి ఎస్ఐ అహ్మద్ మొహినొద్దీన్, అప్పటి రామాయంపేట సీఐ వెంకటరాజా గౌడ్, లైజనింగ్ అధికారులు ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ కృష్ణ, సీడీఓ సాయిబాబా, భరోసా లీగల్ అడ్వైజర్ శ్వేతా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్యలను ఎస్పీ అభినందించారు.



## భూభారతి చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి: డీఆర్వో అంబాదాస్ రాజేశ్వర్

మెదక్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 6: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న భూభారతి చట్టంపై రెవెన్యూ సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) అంబాదాస్ రాజేశ్వర్ సూచించారు. బుధవారం మెదక్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ సిబ్బందికి నిర్వహించిన ఒకరోజు శిక్షణా శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రెవెన్యూ శాఖలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్లు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నందున భూభారతి చట్టంలోని నిబంధనలు, విధివిధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం భూ రికార్డుల నిర్వహణను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మార్చేందుకు, పాత వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్దేందుకు భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ఈ చట్టం ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు రెవెన్యూ అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అపరిచితుల మాటలు నమ్మి ఆన్‌లైన్‌లో డబ్బులు పంపొద్దు: జిల్లా ఎస్పీ నరసింహ






సూర్యాపేట | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 6: అపరిచితుల మాటలు నమ్మి ఆన్‌లైన్‌లో డబ్బులు పంపవద్దని, బహుమతులు, తక్కువ వడ్డీ రుణాలు, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని చెప్పేవారిని సైబర్ మోసగాళ్లుగా గుర్తించాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ, ఐపీఎస్ ప్రజలకు సూచించారు. 'సురక్షా కా తిరంగా–సైబర్ స్వతంత్ర తెలంగాణ' కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో పట్టణ పోలీసులు, జిల్లా సైబర్ సెక్యూరిటీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైబర్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సాంకేతికత పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా కొత్త రూపాల్లో పెరుగుతున్నాయని, అవగాహన లోపం కారణంగా ప్రజలు తమ బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, పిన్ నంబర్లు వంటి వ్యక్తిగత సమాచారాన్ని పంచుకుని మోసాలకు గురవుతున్నారని తెలిపారు. విద్యార్థులు ఇంటర్నెట్‌ను విద్య, విజ్ఞానం కోసం మాత్రమే వినియోగించాలని, డిజిటల్ అరెస్ట్, ఆన్‌లైన్ పెట్టుబడులు, ఇంటి వద్ద నుంచే అధిక ఆదాయం వస్తుందనే ప్రకటనలను నమ్మవద్దని హెచ్చరించారు. సైబర్ మోసానికి గురైన డబ్బు దేశం దాటి వెళ్లిపోతుందని, ప్రజల అత్యాశను ఆసరాగా చేసుకుని మోసగాళ్లు అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారని పేర్కొన్నారు. బ్యాంకు వివరాలు లేదా సర్వీస్ ఛార్జీల పేరుతో డబ్బులు అడిగే వారిని నమ్మవద్దని, ఎలాంటి నగదు బదిలీలు చేయరాదని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం తెలిసిన విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, చుట్టుపక్కల వారిలో కూడా సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, సైబర్ సెక్యూరిటీ సెల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఎస్ఐలు సందీప్, యాదవేందర్ రెడ్డి, షీ టీమ్ ఎస్ఐ నీలిమ, కళాశాల ప్రిన్సిపల్ ముత్యాలరాజు, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది, సైబర్ వారియర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.



## నర్సాపూర్ అయ్యప్ప ఆలయంలో అన్నప్రసాద కార్యక్రమం ప్రారంభం

నర్సాపూర్ | సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి | ఆగస్టు 6: మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని శ్రీ ఆదిపరాశక్తి వనగిరి శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప క్షేత్రంలో భక్తుల కోసం అన్నప్రసాద కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ దుర్గప్ప అశోక్ గౌడ్, పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ పూజారులు అయ్యప్ప స్వామివారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ దుర్గప్ప అశోక్ గౌడ్ మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందని, ప్రతి బుధవారం భక్తులకు అన్నప్రసాదం అందజేయనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవ గౌడ్ స్వామి, రాములు గుప్తా స్వామి, రమేష్ గౌడ్ స్వామి, నాగరాజు స్వామి, బి. అశోక్ గౌడ్ స్వామి, శ్రీనివాస్ గౌడ్ స్వామి, రాజు యాదవ్, గంగరాం గౌడ్ స్వామి, శంకర్ స్వామి, మహేష్, గణేష్, నర్సింలు గౌడ్, సముద్రాల శ్రీనివాస్, మురళి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## అల్లాదుర్గం–మెటల్‌కుంట రహదారి అభివృద్ధికి రూ.217 కోట్లు మంజూరు



సంగారెడ్డి | సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ఇంచార్జి కె. సంగమేశ్వర్ | ఆగస్టు 6: సంగారెడ్డి జిల్లా అల్లాదుర్గం–మెటల్‌కుంట ప్రధాన రహదారి అభివృద్ధి, విస్తరణ పనుల కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.217 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 48 కిలోమీటర్ల పొడవైన ఈ రహదారి గత పదేళ్లుగా నిర్లక్ష్యానికి గురై గుంతలమయంగా మారడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను స్థానిక ప్రజలు, కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ప్రత్యేక చొరవతో నిధులు మంజూరైనట్లు నాయకులు తెలిపారు. ఆందోల్ నియోజకవర్గ ప్రజల దశాబ్దాల కల నెరవేరబోతుందని, త్వరలోనే రహదారి నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని మంత్రి పేర్కొన్నట్లు వెల్లడించారు. ఈ రహదారి అభివృద్ధి పూర్తయితే అల్లాదుర్గం నుంచి మెటల్‌కుంట మీదుగా హైదరాబాద్‌కు ప్రయాణం మరింత సులభతరం కావడంతో పాటు గుంతలు లేని విశాలమైన రహదారి ద్వారా ప్రమాదాలు తగ్గి సురక్షిత రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. అలాగే పరిసర గ్రామాల రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు సులభంగా తరలించుకునే అవకాశం లభించి గ్రామీణ ఆర్థికాభివృద్ధికి ఈ ప్రాజెక్టు దోహదం చేస్తుందని నాయకులు అభిప్రాయపడ్డారు. పదేళ్లుగా ఎదురుచూస్తున్న ఈ రహదారి పనులకు నిధులు మంజూరవడంతో అల్లాదుర్గం, వట్‌పల్లి, రైకోడ్, జరాసంగం మండలాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## భద్రాద్రి సీతారాముల దర్శనం చేసుకున్న మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్

పటాన్చెరు, ఆగస్టు 6 (సందేశం టైమ్స్ ప్రతినిధి): పటాన్చెరువు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ తన మిత్రులతో కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానాన్ని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందిన అనంతరం ఆయన మాట్లాడుతూ, మిత్రులతో కలిసి భద్రాద్రి సీతారాముల దర్శనం చేసుకోవడం ఆధ్యాత్మికంగా ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ముఖ్యంగా పటాన్చెరు డివిజన్ ప్రజలు సుభిక్షంగా జీవించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. శ్రీరాముడు స్వయంగా నడయాడిన పవిత్ర భూమిగా ప్రసిద్ధి చెందిన భద్రాద్రిని ప్రతి ఒక్కరూ జీవితంలో కనీసం ఒక్కసారైనా దర్శించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెలిమెల మాజీ సర్పంచ్ విఠల్ రెడ్డి, చింతల్ భాయ్ సంజీవ రెడ్డి, ఆల్విన్ కాలనీ ప్రెసిడెంట్ సత్యనారాయణ, ఎలక్ట్రికల్ వెంకట్ రెడ్డి, మురళీధర్, చింతల్ భాయ్ అంజిరెడ్డి, సంజీవ రెడ్డి (సీజీఆర్), రవీందర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి (యోగ), సాయి చరణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




## వేధింపులపై భయపడొద్దు.. షీ టీమ్స్‌ను ఆశ్రయించండి

తూప్రాన్, ఆగస్టు 6 (సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి): మహిళలు, బాలికల భద్రతే లక్ష్యంగా షీ టీమ్స్ సిబ్బంది తూప్రాన్‌లోని మాస్టర్ మైండ్స్ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్స్ సిబ్బంది స్వరూప మాట్లాడుతూ మహిళలు, బాలికలపై జరిగే వేధింపులు, ఈవ్‌టీజింగ్, అసభ్యకర ప్రవర్తనను అరికట్టేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. విద్యార్థినులు తమకు ఎదురయ్యే వేధింపులు లేదా ఇబ్బందులను భయపడకుండా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులతో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు వంటి సమాచారాన్ని పంచుకోవద్దని హెచ్చరించారు. ఫోన్ కాల్స్, సందేశాలు, నకిలీ లింకుల ద్వారా సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని, గుర్తు తెలియని లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు. ఆన్‌లైన్‌లో పరిచయమైన వారిని పూర్తిగా నమ్మి వ్యక్తిగత సమాచారాన్ని వెల్లడించవద్దని తెలిపారు. మహిళలు, బాలికలకు ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యం లేదా పోలీసులను సంప్రదించాలని, షీ టీమ్స్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



## ఎల్ఐసీ వాటాల విక్రయ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి: ఐసీఈయూ

సూర్యాపేట, ఆగస్టు 6 (సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్): ఎల్ఐసీలో ఆఫర్ ఫర్ సేల్ (OFS) పేరుతో ప్రభుత్వ వాటా 6.5 శాతాన్ని విక్రయించే యోచనను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐసీఈయూ) సూర్యాపేట బ్రాంచ్ అధ్యక్షుడు ఎల్. మోహన్ సింగ్ డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐఐఈఏ) దేశవ్యాప్త పిలుపు మేరకు బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో ఐసీఈయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ సింగ్ మాట్లాడుతూ, ఖాతాదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎల్ఐసీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, సంస్థను బలహీనపరిచే నిర్ణయాలను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. ఆఫర్ ఫర్ సేల్ ద్వారా సుమారు రూ.31 వేల కోట్ల విలువైన ప్రభుత్వ వాటాను విక్రయించేందుకు ప్రయత్నించడం ఆందోళనకరమని, దీనివల్ల సంస్థ భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని ఉద్యోగులు, పాలసీదారులు, ప్రజలందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐసీఈయూ సూర్యాపేట బ్రాంచ్ కార్యదర్శి డి. ప్రభాకర్, నాయకులు కె. రామయ్య, చాంద్ పాషా, శంకర్, శివకుమార్, సంజీవయ్య, హరిశంకర్, రామకృష్ణ, సువర్ణ, సందీప్, బాలు, ఎల్ఐసీ ఉద్యోగులు, ఏజెంట్లు, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

## భూముల రీ సర్వేపై రైతులకు అవగాహన గ్రామసభలు

చింతకాని, ఆగస్టు 6 (సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి శెట్టి సురేష్): భూముల రీ సర్వే కార్యక్రమంలో భాగంగా తొలి విడతలో చింతకాని మండలంలోని రేపల్లెవాడ, లచ్చగూడెం, చిన్న మండవ రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ గ్రామాల్లో త్వరలో రీ సర్వే నిర్వహించి అర్హులైన రైతులకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో రైతులకు ముందస్తు అవగాహన కల్పించేందుకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

గ్రామసభల వివరాలు:

ఆగస్టు 6: రేపల్లెవాడ గ్రామపంచాయతీ కార్యాలయం – ఉదయం 10:30 గంటలకు

ఆగస్టు 7: లచ్చగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం – ఉదయం 10:30 గంటలకు

ఆగస్టు 7: చిన్న మండవ గ్రామపంచాయతీ కార్యాలయం – మధ్యాహ్నం 12:30 గంటలకు

రీ సర్వే ప్రక్రియ, భూ రికార్డుల నవరణ, పట్టాదారు పాస్‌పుస్తకాల జారీ తదితర అంశాలపై అధికారులు రైతులకు వివరించనున్నందున సంబంధిత గ్రామాల రైతులు తప్పనిసరిగా గ్రామసభలకు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

## ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో కాంక్రీట్ పనులకు శ్రీకారం



నాగులవంచ, ఆగస్టు 06 (సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్‌చార్జి శెట్టి సురేష్): ఖమ్మం జిల్లా చింతకాని మండలంలోని నాగులవంచ గ్రామంలో ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణ అభివృద్ధి పనులకు గ్రామస్తులు, అఖిలపక్ష నాయకుల సహకారంతో సుమారు రూ.1.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న కాంక్రీట్ పనులకు బుధవారం ఘనంగా శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా శివాలయ పూజారి దాములూరి వెంకటేశ్వర శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆలస్యం వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ అంబటి శరత్‌కుమార్, దేవాలయ కమిటీ చైర్మన్ ముత్తినేని వెంకటేశ్వరరావు, దేవాలయ కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్, సీపీఎం నాయకులు, గొర్రెల కాపరుల సంఘం ప్రతినిధులు, భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ అభివృద్ధి పనులతో ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించబడతాయని నిర్వాహకులు తెలిపారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా.. జిల్లాలో 86.98 శాతం ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ పూర్తి





ఖమ్మం, ఆగస్టు 06 (సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్‌చార్జి శెట్టి సురేష్): ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు 86.98 శాతం ఓటర్ల వివరాలు డిజిటలైజ్ అయ్యాయని, పోలింగ్ స్టేషన్ వారీగా డిజిటలైజేషన్ నివేదికను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేస్తామని తెలిపారు. ప్రత్యేక పరిశీలనలో జిల్లాలో 95,740 మంది ఓటర్లు శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారినట్లు, 33,134 మంది మరణించినట్లు గుర్తించామని, మరో 42,814 మంది ఓటర్ల మ్యాపింగ్ ఇంకా పూర్తి కాలేదని వెల్లడించారు. ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 10 నాటికి ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌తో పాటు పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు చెప్పారు. జిల్లాలో 19 కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, వీలైనంత వరకు ప్రభుత్వ భవనాల్లోనే వాటిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించి, సెప్టెంబర్ 16 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లు స్వీకరిస్తామని, వాటిని అక్టోబర్ 15 నాటికి పరిష్కరించి అక్టోబర్ 19న తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామని వెల్లడించారు. సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాస్, ఎస్‌డీసీ సదానందం, ఎన్నికల విభాగం అధికారులు, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం, టీడీపీ, ఆప్ తదితర రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



# ఎరువుల కొనుగోలుకు ఎఫ్ఎఫ్ఎస్ యాప్ అందుబాటులోకి

మెదక్ / అల్లాదుర్గం, ఆగస్టు 06,సందేశం టైమ్స్ అల్లాదుర్గం మండల ప్రతినిధి ప్రవీణ్, రైతులకు సబ్సిడీ ఎరువుల పంపిణీని మరింత పారదర్శకంగా, సులభతరంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎఫ్ఎఫ్ఎస్ (Framework for Fertilizer Sale) యాప్‌ను ఆగస్టు 6 నుంచి అమల్లోకి తీసుకువచ్చినట్లు అల్లాదుర్గం మండల వ్యవసాయ అధికారి రాజేష్‌కుమార్ తెలిపారు. ఈ నూతన డిజిటల్ విధానం ద్వారా రైతులు తమ మొబైల్ నంబర్‌తో నమోదు చేసుకుని అవసరమైన ఎరువులను ముందస్తుగా బుక్ చేసుకునే అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. అనంతరం రూపొందే క్యూఆర్ కోడ్‌ను గుర్తింపు పొందిన ఎరువుల డీలర్‌కు చూపించి సబ్సిడీ ఎరువులను పొందవచ్చని వివరించారు. ఈ విధానం ద్వారా ఎరువుల పంపిణీలో పారదర్శకత పెరగడంతో పాటు అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌కు అడ్డుకట్ట పడుతుందని తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, కొత్త విధానంపై ఎలాంటి అపోహలకు లోనుకాకుండా ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌ను సద్వినియోగం చేసుకుని ఎరువులు కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారి రాజేష్‌కుమార్ రైతులకు సూచించారు.



# ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారానే సబ్సిడీ ఎరువుల విక్రయాలు: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్, ఆగస్టు 06 (సందేశం టైమ్స్ ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎఫ్ఎఫ్ఎస్ (Framework for Fertilizer Sale) యాప్ ద్వారా ఆగస్టు 6 నుంచి అన్ని సబ్సిడీ ఎరువుల విక్రయాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. రైతులకు నాణ్యమైన ఎరువులను సకాలంలో పారదర్శకంగా అందించడంతో పాటు ఎరువుల పంపిణీ వ్యవస్థను పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే లక్ష్యంతో ఈ విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు అమలులో ఉన్న యూరియా బుకింగ్ యాప్ స్థానంలో ఇకపై యూరియా, డీఏపీ, ఎంఓపీ, ఎన్‌పీకే కాంప్లెక్స్ ఎరువులు సహా అన్ని సబ్సిడీ ఎరువుల విక్రయాలు ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారానే జరుగుతాయని తెలిపారు. రైతులు తమ మొబైల్ నంబర్‌తో యాప్‌లో నమోదు చేసుకుని, పంట వివరాలు, సాగు విస్తీర్ణం, అవసరమైన ఎరువుల వివరాలను నమోదు చేసిన తర్వాత రూపొందే క్యూ ఆర్ కోడ్‌ను ఎంపిక చేసిన ఎరువుల డీలర్‌కు చూపిస్తే, ధృవీకరణ అనంతరం ఎరువులు అందజేస్తారని వివరించారు. ఈ విధానంతో ఎరువుల పంపిణీలో పారదర్శకత పెరగడంతో పాటు అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్ నియంత్రణలోకి వస్తుందని, కేంద్ర ప్రభుత్వం అందించే సబ్సిడీ సరైన రైతులకు చేరేలా పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా ఉంటుందని తెలిపారు. రైతులు ఎలాంటి అపోహలకు గురికాకుండా కొత్త విధానానికి సహకరించాలని, నమోదు లేదా క్యూ ఆర్ కోడ్‌కు సంబంధించిన సందేహాలుంటే తమ గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారిని (ఏఈఓ) సంప్రదించాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో రైతుల అవసరాలకు అనుగుణంగా 2,846 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన మేరకే ఎరువులు కొనుగోలు చేసి వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ విజ్ఞప్తి చేశారు.

# బిర్యానీ పాయింట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి





సంగారెడ్డి / రామచంద్రపురం, ఆగస్టు 06,సందేశం టైమ్స్ ప్రతినిధి,సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం చౌరస్తా వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ కేతకి సంగమేశ్వర మినీ బిర్యానీ పాయింట్ అండ్ టిఫిన్ సెంటర్ను ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీఆర్ఎస్ టీపీయూఎస్ మండల అధ్యక్షుడు అబూ అలీ ఖురేషి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి, వ్యాపార సంస్థ ప్రజల ఆదరణతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. స్థానిక ప్రాంతంలో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రజలకు నాణ్యమైన ఆహార సేవలు అందించాలని సూచించారు. అనంతరం స్థానికులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన వ్యాపార సంస్థ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ నిర్వాహకులను అభినందించారు.

# సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభకు సర్వం సిద్ధం




హైదరాబాద్, ఆగస్టు 06, సందేశం టైమ్స్ ప్రతినిధి, తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతో పాటు పలువురు ప్రముఖులు ఈ సభలో పాల్గొననున్నారు. సామాజిక న్యాయ తెలంగాణ సాధనకు కట్టుబడి ఉంటామని కవితతో పాటు సుమారు 10 వేల మంది ప్రతినిధులు ప్రతిజ్ఞ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సాధికారతకు సంబంధించిన పార్టీ కార్యాచరణను ఈ సభ వేదికగా ప్రకటించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరానున్న నేపథ్యంలో సభా ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్, మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, భాగ్యరెడ్డి వర్మ, చాకలి ఐలమ్మ, కొమురం భీమ్, సర్దార్ సర్వాయి పాపన్న, కాన్షీరామ్, కొండా లక్ష్మణ్ బాపూజీ తదితర సామాజిక మహనీయుల చిత్రపటాలను ఏర్పాటు చేశారు. తెలంగాణను సామాజిక న్యాయ దిశగా ముందుకు తీసుకెళ్లే సంకల్పంతో ఈ సభను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



## సదాశివపేటలో అంగరంగ వైభవంగా దుర్గమ్మ జాతర ఎడ్లబండ్ల ఊరేగింపు

సంగారెడ్డి / సదాశివపేట, ఆగస్టు 06 సందేశం టైమ్స్ ప్రతినిధి సంగారెడ్డి జిల్లా సదాశివపేట మున్సిపాలిటీ పరిధిలో నిర్వహిస్తున్న దుర్గమ్మ జాతర సందర్భంగా చీల మల్లన్న ఆధ్వర్యంలో సంప్రదాయ ఎడ్లబండ్ల ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనాదిగా కొనసాగుతున్న చీల కుటుంబ పరంపరలో భాగంగా నిర్వహించిన ఈ ఎడ్లబండ్ల ఊరేగింపు జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, యువ నాయకులు, భక్తులు పాల్గొని జాతర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చీల విశ్వేశ్వర్, చీల వీరన్న, చీల శివచంద్ర, చీల వేషాల, బోడగ్గమ సంగన్న, బోడగ్గమ వీరన్న, బ్రహ్మం, స్వామి, చందు స్వామి, ఎంఆర్ఎఫ్ ఉద్యోగి ఈశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.



## తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ నర్సాపూర్ వైస్ ప్రెసిడెంట్‌గా డి. వినోద్ కుమార్ నియామకం

సంగారెడ్డి, ఆగస్టు 06 ,సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు శెట్టి అశోక్ ఆదేశాల మేరకు నర్సాపూర్ వైస్ ప్రెసిడెంట్‌గా నూతనంగా నియమితులైన డి. వినోద్ కుమార్‌కు జోగిపేట్ ఎస్సై గిరి శ్రీకాంత్ చేతుల మీదుగా అపాయింట్‌మెంట్ లెటర్ అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై గిరి శ్రీకాంత్ మాట్లాడుతూ సమాజానికి నిజాయితీతో కూడిన వార్తలను అందించడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని, ప్రజా సమస్యలను బాధ్యతాయుతంగా వెలుగులోకి తీసుకురావడంలో మీడియా ప్రతినిధులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. నూతన బాధ్యతలు స్వీకరించిన డి. వినోద్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ నేషనల్ సెక్రటరీ టి. సంగమేశ్వర్, నేషనల్ ప్రచార కార్యదర్శి కే. సంగమేశ్వర్, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణ, స్టేట్ సహాయ కార్యదర్శి మన్నే పోచయ్యతో పాటు ఇతర సభ్యులు పాల్గొని నూతనంగా నియమితులైన డి. వినోద్ కుమార్‌ను అభినందించారు.

## బీడకన్యలో రాచన్న స్వామి లొంక ఆలయ అభివృద్ధికి రూ.50 వేల విరాళం



ఝరాసంగం, ఆగస్టు 06 సందేశం టైమ్స్ ప్రతినిధి సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని బీడకన్య గ్రామంలో ఉన్న రాచన్న స్వామి లొంక పురాతన గోపురం, ఆశ్రమ అభివృద్ధి కోసం శ్రీశ్రీశ్రీ నాగదేవత ఉపాసకురాలు జయమ్మ మాతాజీ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలకు రామచంద్రాపూర్ మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ దంపతులు రూ.50 వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జయమ్మ మాతాజీ వారిని ఆశీర్వదించి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజలు కూడా ఆలయ గోపుర నిర్మాణం, మెట్ల ఏర్పాటు వంటి అభివృద్ధి పనులకు తమ వంతు సహకారం అందిస్తూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. జయమ్మ మాతాజీ కుల, మత భేదాలు లేకుండా ప్రజలకు సేవలందిస్తూ, వివిధ సమస్యలతో వచ్చే వారికి ధైర్యం చెప్పి అండగా నిలుస్తున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. అయితే కొంతమంది రాజకీయ కారణాలతో మాతాజీకి సంబంధించిన ఆలయ నిర్మాణాన్ని కూల్చివేయడం బాధాకరమని గ్రామ ప్రజలు, గ్రామ సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. బీడకన్య గౌటాన్ పరిధిలో సుమారు 350 ఎకరాల భూమిలో మూడు పురాతన ఆలయాలు ఉన్నప్పటికీ ఒక్క ఈ ఆలయాన్నే ఎందుకు కూల్చివేశారో విచారణ జరిపి న్యాయం చేయాలని వారు కోరారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఎంపీ సురేష్ షెట్కార్ తదితర ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఆలయ పరిరక్షణకు అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని శ్రీశ్రీశ్రీ నాగదేవత ఉపాసకురాలు జయమ్మ మాతాజీ విజ్ఞప్తి చేశారు.

## చౌటకూర్ గ్రామంలో దోమల నివారణకు మందు పిచికారీ



చౌటకూర్, ఆగస్టు 06 , సందేశం టైమ్స్ అందోల్ నియోజకవర్గం ఇంచార్జి కే. మల్లేశం గౌడ్ సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం పరిధిలోని చౌటకూర్ గ్రామంలో దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించే లక్ష్యంతో బుధవారం గ్రామంలోని వీధులు, కాలనీల్లో ప్రత్యేకంగా దోమల నివారణ మందును పిచికారీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పార్కల రాం రెడ్డి కార్యక్రమంలో పాల్గొని గ్రామస్థులకు పరిశుభ్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చని సూచించారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన చర్యలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రామ గౌడ్, వార్డు సభ్యులు చక్రపాణి, డప్పు అశోక్, గోరిమియా, బలరాజ్, లక్ష్మయ్య, నాయకులు రాజేశ్వర్ గౌడ్, బలరాజ్, రాజారావు తదితరులు పాల్గొన్నారు.



## ఖాదిరాబాద్ పీఏసీఎస్ చైర్మన్‌గా రమేష్ జ్యోషి ఏకగ్రీవ ఎన్నిక

సంగారెడ్డి / వట్పల్లి, ఆగస్టు 06 సందేశం టైమ్స్ వట్పల్లి ప్రతినిధి సీఎచ్. బస్వరాజ్ సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం వట్పల్లి మండలం ఖాదిరాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా మాజీ మండల అధ్యక్షుడు రమేష్ జ్యోషి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల నాయకుల సహకారంతో సంస్థను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అనుభవజ్ఞుడైన నాయకుడిగా రమేష్ జ్యోషిని ఎంపిక చేసినట్లు తెలిపారు. డైరెక్టర్లు, మండల సర్పంచులు, మండల అధ్యక్షులు, పలువురు నాయకుల సమక్షంలో ఎన్నిక ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్ రమేష్ జ్యోషికి పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. PACS అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.



## డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ కార్యక్రమం

సంగారెడ్డి / పటాన్‌చెరు, ఆగస్టు 06 సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్ సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో నషా ముక్తి భారత్ అభియాన్ మరియు బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించిన మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమంలో శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి, మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల యువత భవిష్యత్తు దెబ్బతింటుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి డ్రగ్స్ నిర్మూలనకు సహకరించాలని సూచించారు. విద్య, క్రీడలు, నైతిక విలువలతో కూడిన జీవితాన్ని యువత నిర్మించుకోవాలని కోరారు. సమాజంలో మాదక ద్రవ్యాలపై అవగాహన పెంచడం ద్వారా ఆరోగ్యవంతమైన భవిష్యత్తును సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, బ్రహ్మ కుమారీస్ ప్రతినిధులు, యువత పాల్గొన్నారు.

## పెట్రోలియం, సహజవాయువు పార్లమెంటరీ స్థాయీ సంఘం సమావేశానికి ఎంపీ వద్దిరాజు హాజరు



ఢిల్లీ, ఆగస్టు 06 సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్చార్జి శెట్టి సురేష్ పెట్రోలియం, సహజవాయువు పార్లమెంటరీ స్థాయీ సంఘం సమావేశం బుధవారం సాయంత్రం ఢిల్లీలోని పార్లమెంట్ అనెక్స్ భవనంలో నిర్వహించారు. స్థాయీ సంఘం చైర్మన్ సునీల్ దత్తాత్రే తర్కరే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ ఎంపీ వద్దిరాజు రవిచంద్రతో పాటు పలువురు సభ్యులు, వివిధ చమురు సంస్థల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా దేశంలో ప్రస్తుతం ఉన్న క్రూడాయిల్, సహజ వాయువు, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ నిల్వలు, పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై సమీక్షించారు. చమురు ధరల హెచ్చుతగ్గులు, వాటి నియంత్రణ, స్థిరీకరణ చర్యలు, కల్తీల నివారణ, ప్రమాదాల నియంత్రణ, వ్యర్థాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై స్థాయీ సంఘం సభ్యులు చర్చించారు. వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన, వేగవంతమైన సేవలు అందించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షణ చేపట్టాల్సిన అవసరం ఉందని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సూచించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆయన సలహాలు, సూచనలు అందించారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నెంబర్: TGTEL/25/A0348, టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ-మెయిల్ : sandeshamtimes@gmail.com, : www.sandeshamtimes.com, (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్ SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522006.